దక్షిణాపథ వార్తావని

ఏప్రిల్ 2026

సంపుటి - 04
సంచిక - 03

సాంప్రదాయకంగా మన దేశంలో వింధ్యకు దక్షిణాన ఉన్న భూమి దక్షిణాపథంగా పరిగణించబడుతుంది.భారతీయ ఏకాత్మత స్ఫూర్తిగా సమాజాన్ని, మారుతున్న కాలాన్ని ప్రతిబింబిస్తూ గొప్ప రాజకీయ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజలు, స్ఫూర్తిదాయక చిహ్నాలను సంగ్రహించడం, సమీకరించడం దక్షిణాపథం పేరిట నడిపే ఈ బులెటిన్ లక్ష్యం. రాష్ట్రాల పరంగా చూస్తే దక్షిణాపథం ప్రస్తుత ఆంధ్రప్రదేశ్, గోవా, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, పాండిచ్చేరి, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలను సూచిస్తుంది. ప్రస్తుతమున్న మధ్యప్రదేశ్, చత్తీస్ గఢ్ మరియు ఒడిషాలోని కొన్ని ప్రాంతాలు కూడా దక్షిణాపథం క్రిందికే వస్తాయి. ఈ ప్రాంతాల విషయాలు ఈ బులెటిన్ లో ప్రస్తావిస్తున్నాము.

నృసింహ జయంతి (ఏప్రిల్ 30)

వైశాఖ శుద్ధ చతుర్దశి, నృసింహ జయంతి. హిరణ్యకశిపుడుని చంపటానికి, తన భక్తుడైన ప్రహ్లాదుని నమ్మకాన్ని నిలబెట్టడానికి శ్రీమన్నారాయణుడు నరసింహస్వామి రూపంలో వైశాక శుద్ధ చతుర్దశి నాడు అవతరించారు. సాధారణంగా నృసింహం అంటే సగం నరుడు, సగం సింహం అనే అర్థం చెప్తారు. కానీ తత్త్వంలోకి వెళితే జీవుల దేహాత్మ భావనను (ఈ శరీరమే నేను) అనే భావనను తొలగించే తత్త్వమే నృసింహ తత్త్వం. నరసింహస్వామి నమ్మకానికి, తక్షణమైన రక్షణకు ప్రతీక. అందరూ నృసింహ స్వామిని ఉగ్రస్వరూపం అంటారు కానీ ఆయన అందరికీ ఉగ్రుడు కాదు. తాను ఈ దేహమే అనుకున్న భక్తుడికి ఆ భావన పోగట్టడంలో ఆయన ఉగ్రస్వరూపాన్ని చూపుతాడు.

హిరణ్యకశిపుడు విష్ణు ద్వేషి, అయినా బ్రహ్మను గూర్చి తపస్సు చేసి, మరణం ఉండరాదని వరం అడుగుతాడు. అది కుదరదని, పుట్టిన ప్రతివాడు గిట్టక తప్పదని బ్రహ్మ చెప్పగా, తనకు మనిషి చేతిలో కానీ, జంతువు చేతిలో కానీ, దేవతల చేతిలో కానీ మరణం ఉండరాదని, పగలు, రాత్రి, ఇంట్లో, బయటా మరణం సంభవించకూడదని, ఆయుధాలు తనను ఏమీ చేయరాదని, ఆకాశంలో కానీ, భూమిపై కానీ మరణించకూడదని, ఇలా అనేక విధాలుగా వరం అడుగుతాడు. సరేనంటాడు బ్రహ్మ. తనకు ఇక మరణం లేదనుకున్న హిరణ్యకశిపుడు, విర్రవీగి యజ్ఞయాగాది క్రతువులను ధ్వంసం చేస్తాడు. తానే దేవుడినని, తననే పూజించమని లోకమంతటా ఆజ్ఞాపిస్తాడు.

సగం మనిషి, సగం సింహం రూపంలో; తన గోర్లనే ఆయుధంగా చేసుకుని; పగలు, రాత్రికి సంధికాలమైన సంధ్యాసమయంలో; ఇంట్లోనూ కాక, బయటా కాక, ఇంటి గడప మీద; నేల మీద కాక, ఆకాశంలో కాక, తన తొడల మీద పెట్టుకుని హిరణ్యకశిపుని సంహరించాడు నారసింహుడు. అసాధ్యమనుకున్నది కూడా విష్ణువు తల్చుకుంటే సుసాధ్యమవుతుందని చెప్తుందీ పురాణగాథ.

లక్ష్మీనరసింహస్వామికి ప్రీతికరంగా కొందరు భక్తులు నృసింహ జయంతి రోజున ఉపవాసం చేస్తారు. స్వామికి వడపప్పు, పానకం నివేదన చేయడం శ్రేయస్కరం. అసలేమీ చేయలేకపోయినా, కేవలం ఒక్క నమస్కారం హృదయపూర్వకంగా చేసుకున్నా స్వామి అనుగ్రహం లభిస్తుంది. నరసింహ స్వామి స్తోత్రాలు పఠించడం, అవి రాకపోతే ఓం నృసింహాయ నమ:, ఓం నారసింహాయ నమ: అని జపించడం ఉత్తమం. అది కూడా చదవడం రాకపోతే కనీసం 'జయ నరసింహ, జయ జయ నరసింహ' అని నామం చెప్పుకున్నా అంతే ఫలితం వస్తుంది. స్తోత్రం చదివామా? మంత్రం జపించామా? నివేదన చేశామా? అన్నది ఈశ్వరుడు చూడడు. నిర్మలమైన మనసుతో ఆయన్ను హృదయంలో ధ్యానించామా లేదా అన్నదే చూస్తాడు. ఈ పూజలన్నీ మన చిత్తశుద్ధి కొరకే కనుక వీలున్నవాళ్ళు అలా చేయవచ్చు.

నృసింహ స్వామిని సాయం సంధ్యావేళ ఆరాధించడం వలన సకల శుభాలు చేకూరుతాయి.

జయ నారసింహ జయ జయ నరసింహ!

జయ జయ ప్రహ్లాద వరదా లక్ష్మీ నృసింహ

www.dakshinapatha.com www.csisindia.com

దక్షిణాపథ స్టడీస్ బులెటిన్

ఈ పత్రిక లో దక్షిణాపథ యొక్క ఆర్థిక సామాజిక సాంస్కృతిక రాజకీయ చరిత్ర పై మీ వ్యాసాలు ప్రచురించాలంటే సంప్రదించండి

For publishing your articles on Socio Cultural political and Economic history of Dakshinapatha please contact research@csisindia.com

Contact : +917075881925

సముద్ర దినోత్సవం (ఏప్రిల్ 5)

భారతదేశ చరిత్రలో సముద్రం (Sea Power) ఒక ముఖ్యమైన భాగం. పురాతన కాలం నుంచే భారతీయులు సముద్ర మార్గాల ద్వారా వాణిజ్యం చేసేవారు. అయితే మధ్యయుగ కాలంలో యూరోపియన్ శక్తులు భారత సముద్ర ప్రాంతాలను ఆక్రమించి తమ ఆధిపత్యాన్ని స్థాపించాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారతదేశంలో సముద్ర శక్తి ప్రాముఖ్యతను గుర్తించి, దాన్ని బలపరిచిన మహా వీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్. ఆయన చేసిన కృషి భారత సముద్ర దినోత్సవ ఆత్మను అర్థం చేసుకోవడానికి కీలకం.

ప్రతి సంవత్సరం ఏప్రిల్ 5న భారతదేశంలో జాతీయ సముద్ర దినోత్సవం (National Maritime Day) జరుపుకుంటారు. ఈ రోజు 1919లో భారతీయులచే నిర్వహించబడిన తొలి నౌకా ప్రయాణాన్ని గుర్తుచేస్తుంది.
ఆ రోజు Scindia Steam Navigation Company సంస్థకు చెందిన SS Loyalty అనే నౌక ముంబై నుంచి లండన్‌కు ప్రయాణం ప్రారంభించింది.
ఇది బ్రిటిష్ ఆధిపత్యంలో ఉన్న సముద్ర వ్యాపారానికి భారతీయుల సమాధానంగా నిలిచింది.

ఈ దినోత్సవం లక్ష్యాలు:

- సముద్ర వ్యాపారం ప్రాధాన్యతను తెలియజేయడం
- నావికుల సేవలను గౌరవించడం
- భారత నౌకాశ్రయ చరిత్రను గుర్తుచేయడం

అయితే ఈ దినోత్సవం యొక్క మూల స్ఫూర్తి చాలా ముందే, ముఖ్యంగా శివాజీ మహారాజ్ కాలంలోనే ప్రారంభమైంది.

ఛత్రపతి శివాజీ మహారాజ్ (1630--1680) మరాఠా సామ్రాజ్య స్థాపకుడు మాత్రమే కాకుండా, భారతదేశంలో సముద్ర రక్షణకు పునాది వేసిన నాయకుడు.

ఆయన కాలంలో పోర్చుగీస్, డచ్, బ్రిటిష్ వంటి యూరోపియన్ శక్తులు సముద్రాన్ని పూర్తిగా నియంత్రించేవి. భారత రాజ్యాలు భూభాగ యుద్ధాలపైనే ఎక్కువ దృష్టి పెట్టేవి. కానీ శివాజీ మహారాజ్ సముద్ర శక్తి ప్రాముఖ్యతను ముందుగానే గ్రహించారు. ఆయన భావనలో "సముద్రాన్ని కాపాడినవారే దేశాన్ని కాపాడగలరు" అన్నది ప్రధానం.

శివాజీ మహారాజ్ భారతదేశంలో మొదటి సమర్థవంతమైన నౌకాదళాన్ని నిర్మించారు. ఆయన కాలంలో సుమారు 300--400 యుద్ధ నౌకలు, "గురాబ్", "గాలివట్" వంటి భారీ నౌకలు, శిక్షణ పొందిన నావిక సైన్యం తయారయినాయి. ఆయన నౌకాదళం శత్రు నౌకలపై దాడి చేయడానికి, సముద్ర మార్గాలను రక్షించడానికి, వ్యాపార నౌకలను కాపాడడానికి ఉపయోగపడింది.

శివాజీ మహారాజ్ సముద్ర భద్రత కోసం బలమైన కోటలను నిర్మించారు. ఆయన ఇందుకోసం నిర్మించిన ముఖ్య కోటలు -- సింహదుర్గ, విజయదుర్గ. ఈ కోటల ప్రత్యేకతలు - సముద్ర మధ్యలో నిర్మాణం, శత్రువులు అక్కడికి చేరుకోవడం కష్టం మరియు వాటికి గల రహస్య ప్రవేశ ద్వారాలు. ఇవి మరాఠా నౌకాదళానికి బలమైన రక్షణ కేంద్రాలుగా నిలిచాయి.

శివాజీ మహారాజ్ అనుసరించిన వ్యూహాలు చాలా ఆధునికంగా ఉండేవి. ఆయన ఎక్కువగా చిన్న, వేగవంతమైన నౌకల వినియోగం చేసేవారు. గెరిల్లా యుద్ధ పద్ధతులను అనుసరిస్తూ ఆకస్మిక దాడులను సముద్రంలో కూడా అమలు చేయడం శివాజీ మహారాజ్ ప్రత్యేకత. అల్లాగే పటిష్టమైన తీరప్రాంత నియంత్రణ కూడా ఆయన సముద్ర రక్షణ వ్యూహంలో భాగమే.

ఇటువంటి అసామాన్య సముద్ర తంత్రంతో యూరోపియన్ శక్తులకు గట్టి సవాలు విసరడంతోపాటు మరాఠా సామ్రాజ్యం బలపడటం, భారతీయులకు సముద్ర యుద్ధనీతిపై విశ్వాసం పెరగటం జరిగినది.

నేటి సముద్ర దినోత్సవం ఆధునిక కాలంలో ప్రారంభమైనప్పటికీ, దాని ఆత్మ శివాజీ మహారాజ్ కృషిలో ఉంది. ఎందుకంటే ఆయనే భారత నౌకాదళానికి పునాది వేసారు, నౌకాదళాన్ని నిర్మించారు, సముద్ర భద్రత, వ్యాపార రక్షణకు మొదటగా ప్రాముఖ్యత ఇచ్చారు, దేశ రక్షణకు కొత్త మార్గం చూపించారు . నేటి భారతీయ నావికాదళం కూడా ఆయనను ఆదర్శంగా తీసుకుంటుంది.

భారతదేశ సముద్ర దినోత్సవం మన సముద్ర చరిత్రను గుర్తుచేసే గొప్ప సందర్భంగా నిలుస్తుంది.

ఈ సందర్భంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ చేసిన కృషి అమూల్యం.

అందువల్ల శివాజీ మహారాజ్ భారత సముద్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు.

రాంజీ గోండు (పుణ్యతిథి, ఏప్రిల్ 9)

సహ్యాద్రి పర్వత శ్రేణుల నడుమ కోటబురుజులతో, 13గొలుసుకట్టు చెరువులతో, పచ్చని అడవులతో అలరారే ప్రాంతం నిర్మల్ నగరం. ఇప్పుడది ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కొయ్యబొమ్మల నిలయం కూడా. కేవలం కోట బురుజులు, కొయ్యబొమ్మలే కాదు భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించ బడ్డ ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని వేయి మంది వనవాసీ వీరులను అందించినది కూడా ఈ నిర్మల్ నగరమే.

ఈ వనవాసీ వీరుల నాయకుడే రాంజీగోండు.
కొండల్లో, గుట్టల్లో, అడవుల్లో ఉండేవారు కూడా దేశమాత స్వేచ్ఛ కోసం తిరుగుబాటు చేసి తమ దేహాన్ని ఆహుతిచ్చారని ఋజువు చేసిన ఉదంతానికి ప్రత్యక్ష సాక్షి వేయి ఉరుల మర్రి.
దాదాపు రెండు వందల ఏండ్ల కిందటే ఇక్కడి బిడ్డలకు పోరాట పాఠాలు నేర్పిన వీరుడు రాంజీగోండు. 1857లో ఉత్తర భారతంలో ప్రారంభమైన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామాన్ని ఈ నేలన నడిపిన గోండు వీరుడే రాంజీగోండు. ఈ వీరుని నాయకత్వంలోనే ఏకకాలంలో అటు ఆంగ్లేయులు, ఇటు స్థానిక నైజాం పాలకులతో పోరాటం కొనసాగింది. చెల్లాచెదురుగా చెట్టుకొకరు పుట్టకొకరుగా ఉన్న ఈ పూర్వ ఆదిలాబాదు ప్రాంత

వనవాసులందరినీ ఏకం చేసి బ్రిటిష్ కలెక్టరు నివాసప్రాంతమైన నిర్మల్ నగరాన్నే తన యుద్ధభూమిగా ఎంచుకున్న ధీరుడు రాంజీగోండు. ఈవీరుని నేతృత్వంలో పనిచేసిన వనవీరులను రోహిల్లాలు అంటారు. చారిత్రకమైన ఈ రోహిల్లాల పోరాటానికి మన కుహనా చరిత్రకారులు అసలు స్థానం కల్పించలేదు.

మధ్యభారతంలోని మహారాష్ట్ర, ఒడిశా, మధ్య ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నివసించే అనేకమంది గిరిజన తెగల సమూహాల్లో గోండ్వానా రాజ్యం బ్రిటిష్ పాలకులు రాక పూర్వమే ఏర్పడి ఉన్నది. గోండుల పాలన సా.శ. 1240-1750 వరకు సుమారు 5 శతాబ్దాలపాటు కొనసాగింది. 9 మంది గోండు రాజులలో చివరివాడైన నీలకంఠషా (సా.శ. 1735- 49) ని మరాఠీలు బంధించి చంద్రాపూర్‌ను ఆక్రమించుకున్నారు. దీంతో గోండ్వానా ప్రాంతం మరాఠీల ఆధీనమై, వారు బ్రిటిష్ వారికి తలొగ్గి గోండ్వానాను తెల్లదొరలకు అప్పగించారు. దీంతో గోండుల పాలన అంతమై, ఆంగ్లేయుల, నైజాం పాలన ఆరంభమైంది. వీరి పీడనకు వ్యతిరేకంగా గిరిజనుల తిరుగుబాటు మొదలైంది.

ఆదిలాబాద్ జిల్లాలోని రాంజీగోండు 1860 ప్రాంతంలో నాటి జనగాం (అసిఫాబాద్)ని కేంద్రంగా చేసుకుని బ్రిటిష్ సైన్యాలను ధీటుగా ఎదుర్కొన్న తొలి గిరిజన పోరాట యోధుడు. బ్రిటిష్ సైన్యంతో ఎదురొడ్డి ఝాన్సి లక్ష్మిబాయి వీరమరణం పొందిన తర్వాత నానాసాహెబ్, తాంతియాతోపే, రావు సాహెబ్‌లు తమ బలగాలతో విడిపోయారు. తాంతియా అనుచరులైన రోహిల్లా సిపాయిలు పెద్ద సంఖ్యలో మహారాష్ట్రలోని ఔరంగాబాద్, బీదర్, పర్భనీ, ఆంధ్రప్రదేశ్‌లోని ఆదిలాబాద్ జిల్లాలోకి ప్రవేశించారు. వీరు అజంతా, బస్మత్, లాథూర్, మఖ్తల్, నిర్మల్‌లను పోరాట కేంద్రాలుగా చేసుకున్నారు. వీరి నేతగా ప్రకటించుకున్న రంగారావు నిజాం ప్రభుత్వాన్ని పడగొట్టి, బ్రిటిష్ వాళ్లను తరిమేయాలని పోరాటానికి పూనుకున్నాడు. సైనిక బలగాల శిక్షణలో ప్రజల్ని ఉత్తేజితుల్ని చేసే క్రమంలో బ్రిటిష్ సైన్యానికి పట్టుబడ్డాడు. యావజ్జీవశిక్ష అనుభవిస్తూ అండమాన్ జైలులో 1860 లో మరణించాడు. పిమ్మట రాంజీ నేతృత్వంలో పోరాటం తీవ్రమైంది.

రోహిల్లాల పోరాటం ప్రధానంగా నాటి అసిఫాబాద్ తాలూకా నిర్మల్ కేంద్రంగా జరిగింది. అది ప్రధానంగా గోండులు, కోలాము, కోయ తెగల గిరిజనుల ప్రాంతం. రాంజీగోండ్ సారథ్యంలో తిరుగుబాటు ఉధృతంగా మారింది. ఈ తిరుగుబాటు తుది కీలక ఘట్టం 1860 మార్చి ఏప్రిల్‌లో జరిగింది. బానిస బతుకులు వెళ్లదీస్తున్న గోండు గిరిజనులు వెట్టికి ప్రతిఫలం ఆశించడాన్ని తెల్లదొరలు, వారి తాబేదారు నైజాం నవాబు సహించలేకపోయారు. ఆదిలాబాద్ ఏజెన్సీ ప్రాంతాలు బ్రిటిష్ వారి దౌర్జన్యంతో అల్లకల్లోలంగా మారాయి. రాంజీ నాయకత్వంలో వెయ్యి మంది రోహిల్లాలు, గోండులు కలసి నిర్మల్ సమీపంలోని కొండలను కేంద్రంగా చేసుకుని బ్రిటిష్ పాలకులను ముప్పుతిప్పలు పెట్టారు. నిర్మల్ కలెక్టర్ ఆధ్వర్యంలో నిజాం బలగాలు వారిపై దాడులు చేసాయి. ఆధునిక ఆయుధాల ముందు, బ్రిటిషు వారి కుటిల యుక్తుల ముందు ఆదివాసులు నిలవలేకపోయారు. తెగించి పోరాడుతున్న ఆది వాసులను వెనకనుండి నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపారు. కడదాకా పోరాడిన రాంజీగోండుతో సహా వెయ్యి మందిని పట్టుకుని నిర్మల్ ఎల్లపెల్లి మార్గంలో ఉన్న మర్రి చెట్టుకు 1860 ఏప్రిల్ 9న ఉరితీశారు. ఆ మర్రి చెట్టే వెయ్యి ఉరుల మర్రిచెట్టుగా ప్రసిద్ధి చెందింది. ఇలాంటి చారిత్రక ఘటనలు దేశ చరిత్రలో మునుపెన్నడూ జరిగిన దాఖలాలు లేవు. ఒకేసారి ఒకేచెట్టుకు వెయ్యిమందిని ఉరితీసిన ఘటన మన చరిత్ర పుటల్లో లేకపోవడం విచారకరం. కానీ మాతృభూమి కోసం చిరునవ్వులతో ఉరికొయ్యలను ముద్ధాడిన ఆ వీరుల స్ఫూర్తి తర్వాతితరం స్వతంత్ర యోధులకు ప్రేరణగా నిలచింది.

తెల్లదొరల దురాగతాలకు చిహ్నంగా నిలిచిన ఆ మర్రిచెట్టు తర్వాతి కాలంలో అంటే 1995లో వచ్చిన పెద్ద వడగళ్ల వానకు నేలకు ఒరిగింది. ఆతర్వాత అప్పటి భా.జ.పా. నాయకులు శ్రీ సీ.హెచ్. విద్యాసాగర్ రావు గారి నేతృత్వంలో అదే ప్రదేశంలో మర్రి మొక్క నాటితే... కొందరు ముస్లిం దురాక్రమణ దారులు ఈ స్థలం మాది అంటూ మొక్కను తొలగించారు. ఆ స్థలానికి దగ్గరలోనే రోడ్డుపై తర్వాత కాలంలో ఒక స్థూపం పెట్టారు. అదే విధంగా నిర్మల్ నగరంలో గొలుసుల దర్వాజ ప్రాంతంలో రాంజీ గోండు విగ్రహం పెట్టారు. రాంజీగోండ్ నాయకత్వంలో సాగిన వీరోచిత పోరాటాన్ని చరిత్రకారులు నిర్లక్ష్యం చేశారు. తెలంగాణ పోరాట మూలాలను వెతుక్కుంటూ తనదైన చరిత్రను పునర్నిర్మించుకుంటున్న తరుణంలో రాంజీ చరిత్రను వెలుగులోకి తేవాలి. రాంజీ గోండు పోరాటాన్ని, త్యాగాల్ని భావితరాలకు అందించాలి. అదే ఆవీరునికి మనమిచ్చే ఘన నివాళి.

-వి ఎస్ కే తెలంగాణ సౌజన్యంతో

వేదాద్రి నరసింహస్వామి ఆలయం

వేదాద్రి క్షేత్ర మహాత్మ్యాన్ని గురించిన ప్రస్తావన శ్రీనాథుడి 'కాశీఖండం' లో కనిపిస్తుంది. 'వేదాద్రి', నరసింహ స్వామి అవతరించిన అత్యంత శక్తివంతమైన క్షేత్రాలలో ఒకటి. వేదాలను తనలో నిక్షిప్తం చేసుకున్న పర్వతప్రదేశం కాబట్టి ఈ క్షేత్రానికి వేదాద్రి అనే పేరు వచ్చింది. కృష్ణానదీ తీరంలో కొలువుదీరి పుణ్య ఫలాలను అందించే ఈ దివ్య క్షేత్రం కృష్ణా జిల్లాకి వన్నె తెస్తూ భక్తుల హృదయాలను గెలుచుకుంటూ వుంది.

ఇక స్థలపురాణం ప్రకారం 'సోమకాసురుడు' అనే రాక్షసుడు బ్రహ్మదేవుడి దగ్గర నుండి వేదాలను అపహరించి వాటిని సముద్రగర్భంలో దాచేశాడు. అప్పుడు శ్రీ మహావిష్ణువు మత్స్యావతారమెత్తి సోమకాసురుడిని సంహరించి వేదాలను రక్షించాడు. అప్పుడు వేదాలు స్వామివారి సన్నిధిలో తరించే భాగ్యాన్ని కలిగించమని కోరడంతో నరసింహవతారంలో హిరణ్య కశిపుడిని సంహరించిన అనంతరం ఆ కోరిక తీరుతుందని స్వామి చెప్పాడు. తనని అభిషేకించాలని 'కృష్ణవేణి' కూడా ఆరాట పడుతుందనీ, అందువల్ల తాను వచ్చేంత వరకూ ఈ నదిలో సాలగ్రామ శిలలుగా వుండమంటూ అనుగ్రహించాడు. ఆ తర్వాత హిరణ్య కశిపుడిని సంహరించిన అనంతరం, స్వామి అక్కడే అయిదు అంశలతో ఆవిర్భవించాడు. జ్వాలా నరసింహస్వామి, సాలగ్రామ నరసింహస్వామి, వీర నరసింహస్వామి, యోగానంద నరసింహస్వామి, లక్ష్మీ నరసింహస్వామి అనే అయిదు అంశలతో అవతరించిన స్వామి భక్తులపాలిట కొంగు బంగారమై అలరారుతున్నాడు. అయితే ఈ అయిదు అంశాలలో ప్రధాన మూర్తిగా, ప్రత్యేక శక్తిగా యోగానంద నరసింహస్వామి పూజలందుకుంటూ ఉంటాడు. ఇక కలియుగారంభంలో మానవులు తపస్సులు చేయవలసిన అవసరంలేదనీ, దైవ నామస్మరణ చేస్తే చాలని వ్యాస భగవానుడు చెప్పాడు. దాంతో

బుషులంతా దైవనామ సంకీర్తన చేస్తూ దేశాటన చేయసాగారు. ఆ సమయంలోనే కృష్ణానదీ తీరంలోగల పర్వతంపై నుంచి వేదాలు వినిపించడం వారికి ఆశ్చర్యం కలిగించింది. వేద పురుషులతోసహా శ్రీమన్నారాయణుడు నరసింహ అవతారంలో అక్కడ వెలిశాడని తెలుసుకుని దర్శించి తరించారు.

ఇక్కడకి వచ్చే భక్తులు కృష్ణానదిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకుంటారు. ఆలయంచుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి ఇరుముడులు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. ప్రతి సంవత్సరం వైశాఖ పౌర్ణమికి స్వామి వారి కళ్యాణం వైభవంగా జరుగుతుంది. యోగానంద నృసింహస్వామి వారి మూల రూపము ఈ ప్రపంచములో ఎక్కడా లేనంత సుందరముగా సాలిగ్రామ శిలతో చేయబడి త్రేతాయుగములో ఋష్యశృంగ మహర్షిచే ప్రతిష్ఠింపబడింది.

వేదాద్రి క్షేత్ర మహాత్మ్యం గురించిన ప్రస్తావన శ్రీనాథుడి కాశీ ఖండంలో కనిపిస్తుంది. ఇక ఎర్రా ప్రగడ, నారాయణ తీర్థులు కూడా ఈ క్షేత్రాన్ని దర్శించినట్టు తెలుస్తోంది. విశ్వేశ్వరుడు క్షేత్ర పాలకుడిగా వ్యవహరించే ఈ క్షేత్రాన్ని దర్శించడం వల్ల సకల పుణ్య ఫలాలు ప్రాప్తిస్తాయని భక్తుల విశ్వాసం. విశేషమైనటువంటి పర్వదినాల్లో భారీ సంఖ్యలో తరలి వచ్చిన భక్తులతో ఈ క్షేత్రం కళకళలాడుతూ కనిపిస్తుంది.

పావన కృష్ణానదీ తీరానగల కొండపైన శ్రీ జ్వాలా నరసింహస్వామి స్వయంభూమూర్తిగా వెలసినాడు. కొండ క్రింద శ్రీ యోగానంద నరసింహాలయం ఉంటుంది. ఆలయానికి ఎదురుగా గల కృష్ణానదిలో నరసింహ సాలగ్రామం ఉంది. క్షేత్రంనందు నిత్య పూజలు మరియు వైశాఖ శుద్ధ ఏకాదశికి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ బ్రహ్మోత్సవాలకు దక్షిణ భారతదేశంలోని ఇతర రాష్ట్రాల నుండి భక్తులు తరలివస్తారు. ఈ క్షేత్రాన్ని సందర్శిస్తే అనేక దీర్ఘకాలిక రుగ్మతలకు, మానసిక వ్యాధులకు, కుటుంబపరమైన ఇబ్బందులకు సత్వర పరిష్కారం లభిస్తుందని భక్తులు భావిస్తారు.

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం (ఏప్రిల్ 24)

భారతదేశం గ్రామాల దేశం అని చెప్పబడుతుంది. వేల సంవత్సరాలుగా గ్రామాలు భారతీయ సమాజానికి పునాది. ఈ గ్రామాల పరిపాలనలో "పంచాయతీ వ్యవస్థ'' ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించింది. ఇది కేవలం పరిపాలనా వ్యవస్థ మాత్రమే కాకుండా, సామాజిక న్యాయం, పరస్పర సహకారం, స్వయంపాలన యొక్క ప్రతీకగా నిలిచింది.

భారతదేశంలో పంచాయతీ వ్యవస్థకు వేల సంవత్సరాల చరిత్ర ఉంది. "పంచాయతీ" అనే పదం "పంచ" (అంటే ఐదు మంది) నుండి వచ్చింది. గ్రామంలో గౌరవనీయులు, జ్ఞానం కలిగిన పెద్దలు కలిసి గ్రామ సమస్యలను పరిష్కరించేవారు. వేదకాలంలో గ్రామాలను "సభ" మరియు "సమితి" అనే సంస్థలు పాలించేవి. ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పే అవకాశం ఉండేది. అంతే కాకుండా, స్థానిక సమస్యలు గ్రామస్థాయిలోనే పరిష్కరించబడేవి.

పంచాయితీల ముఖ్య లక్షణాలు:

- స్వయంపాలన
- సామాజిక న్యాయం
- వేగవంతమైన నిర్ణయాలు
- ప్రజల భాగస్వామ్యం

మధ్యయుగంలో కూడా పంచాయతీ వ్యవస్థ కొనసాగింది. ఛత్రపతి శివాజీ మహారాజ్ కాలంలో గ్రామ పరిపాలనకు, పంచాయతీలకు ప్రాముఖ్యత ఇచ్చారు. గ్రామ పెద్దలు, సాధారణంగా పాటిల్ అనీ, కులకర్ణి అనే పిలువబడేవారే పరిపాలన నిర్వహించేవారు. పన్నులు సేకరణ, న్యాయ వ్యవస్థ పంచాయతీల ద్వారా జరిగేది. ఈ కాలంలో పంచాయతీ వ్యవస్థ గ్రామ స్వయం నియంత్రణకు దోహదపడింది, కేంద్ర పాలనకు భారం తగ్గించింది.

అయితే బ్రిటిష్ పాలనలో పంచాయతీ వ్యవస్థ బలహీనపడింది. ఇందుకు దోహదపడిన అంశాలు – కేంద్ర పాలనకు ఎక్కువ ప్రాధాన్యం, స్థానిక స్వయం పాలన తగ్గించడం, ఆదాయ సేకరణపై దృష్టి పెట్టడం వంటివాటిని ముఖ్యంగా చెప్పుకోవచ్చు. అయితే తరువాత వారే కొన్ని సంస్కరణలు తీసుకువచ్చారు, స్థానిక సంస్థలను పునరుద్ధరించడానికి ప్రయత్నించారు.

భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత, గ్రామాభివృద్ధి కోసం పంచాయతీ వ్యవస్థను బలపరచడం ముఖ్య లక్ష్యంగా మారింది. మహాత్మా గాంధీ "గ్రామ స్వరాజ్యం" అనే భావనను ప్రతిపాదించారు, ప్రతి గ్రామం స్వయం సమృద్ధిగా ఉండాలని కోరుకున్నారు.

1992లో భారత ప్రభుత్వం 73వ రాజ్యాంగ సవరణ చట్టం తీసుకువచ్చింది. ఇది పంచాయతీ వ్యవస్థకు చట్టబద్ధ హోదా ఇచ్చింది. ఈ రాజ్యాంగ సవరణతో గ్రామ పంచాయతీలకు రాజ్యాంగ గుర్తింపు లభించింది. గ్రామ పంచాయతీలకు ప్రజాస్వామ్యయుతంగా ప్రతి 5 సంవత్సరాలకు ఎన్నికలు నిర్వహించడం, మహిళలు, అనుసూచిత జాతులు/వర్గాలకు రిజర్వేషన్ వంటి సదుపాయాలు కల్పించడం, గ్రామ సభకు అధికారం కట్టబెట్టడం జరిగినది.

ప్రస్తుతం భారతదేశంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ మూడు స్థాయిల్లో ఉంటుంది:

గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీ ఉంటుంది. దీనికి సర్పంచ్ నాయకత్వం నాయకత్వం వహిస్తాడు. అలానే మండల స్థాయిలో మండల పరిషత్, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ ఉంటుంది. ఈ మూడు స్థాయిలు కలిసి గ్రామాభివృద్ధిని ముందుకు తీసుకెళ్తాయి.

పంచాయతీలు ముఖ్యంగా గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, రహదారులు, నీటి సరఫరా, విద్య, ఆరోగ్య సేవలు, పేదరిక నిర్మూలన పథకాలు వంటివాటిని చేపడతాయి. పంచాయతీలు ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు కీలకంగా మారాయి.

పంచాయతీ వ్యవస్థ వల్ల ప్రజాస్వామ్యం గ్రామ స్థాయికి చేరింది, ప్రజల భాగస్వామ్యం పెరిగింది, గ్రామాల అభివృద్ధి వేగవంతమైంది

భారతదేశంలో పంచాయతీ వ్యవస్థ పురాతన కాలం నుండే బలంగా వ్రేళ్లూనుకుంది. కాలక్రమేణా మార్పులు వచ్చినప్పటికీ, ఇది నేటి ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక భాగంగా నిలిచింది.

గ్రామాల అభివృద్ధి దేశ అభివృద్ధికి దారితీస్తుంది. అందుకే పంచాయతీ వ్యవస్థ భారత ప్రజాస్వామ్యానికి పునాది.

భారతీదాసన్ (జన్మతిథి, ఏప్రిల్ 29)



భారతీదాసన్ -- జాతీయ చైతన్యానికి ప్రతీక, సమాజ సంస్కరణకు మార్గదర్శి.
భారతీయ సాహిత్య ప్రపంచంలో జాతీయ స్ఫూర్తిని, సామాజిక సమానత్వాన్ని, భాషాభిమానాన్ని సమన్వయపరిచిన మహాకవి భారతీదాసన్. ఆయన అసలు పేరు కనకసుబ్బురత్నం. 1891 ఏప్రిల్ 29న పుదుచ్చేరి ప్రాంతంలో జన్మించిన ఆయన, 1964 ఏప్రిల్ 21న పరమపదించారు. తన జీవితమంతా దేశభక్తి, సమాజోద్ధరణ, విద్యా ప్రబోధం వంటి లక్ష్యాలకు అంకితం చేసిన మహోన్నత వ్యక్తి.

భారతీదాసన్ చిన్ననాటి నుంచే సాహిత్యంపై ఆసక్తి కనబరిచారు. తమిళ భాషపై ఆయనకు ఉన్న మక్కువ చిన్న వయసులోనే అభివృద్ధి చెందింది. సాంప్రదాయిక విద్యతో పాటు, సాహిత్యాభిరుచి ఆయనలో పెరిగింది. సమాజంలోని అసమానతలు, కులవివక్ష, అన్యాయాలు ఆయనను లోలోపల కలచివేశాయి. ఈ అనుభవాలే ఆయనను కవిగా, ఆలోచకుడిగా తీర్చిదిద్దాయి.

భారతీదాసన్ జీవితంలో కీలక మలుపు జాతీయకవి సుబ్రహ్మణ్య భారతి ప్రభావం. భారతి కవిత్వంలోని జాతీయత, స్వాతంత్ర్యాసక్తి, స్త్రీ స్వేచ్ఛ భావాలు ఆయనను ఎంతో ప్రభావితం చేశాయి. అందుకే "భారతి శిష్యుడు" అనే అర్థంతో "భారతీదాసన్" అనే పేరును స్వీకరించారు. ఇది కేవలం పేరు మాత్రమే కాదు, ఆయన ఆలోచనా దిశను సూచించే చిహ్నం.

బ్రిటిష్ పాలనలో భారతదేశం ఎదుర్కొన్న దౌర్భాగ్య పరిస్థితులు ఆయన మనసును తీవ్రంగా ప్రభావితం చేశాయి. మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్ వంటి మహానాయకుల ఆలోచనలు ఆయనలో జాతీయ స్ఫూర్తిని పెంపొందించాయి.

ఆయన కవితలు ప్రజల్లో స్వాతంత్ర్యాసక్తిని రగిలించాయి. "దేశం కోసం త్యాగం చేయాలి", "బానిసత్వాన్ని నిర్మూలించాలి" అనే సందేశాలు ఆయన రచనలలో ప్రతిధ్వనించాయి. గ్రామీణ ప్రజలు, కార్మికులు, విద్యార్థులు అందరూ స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

భారతీదాసన్ రచనలు కేవలం సాహిత్య సృష్టి మాత్రమే కాదు, అవి సమాజాన్ని మేల్కొలిపే శక్తివంతమైన సాధనాలు. ఆయన కవితలు, నాటకాలు, వ్యాసాలు ప్రజల్లో చైతన్యం కలిగించాయి. సామాన్య ప్రజల సమస్యలను, వారి బాధలను, ఆశయాలను ఆయన తన రచనల్లో ప్రతిబింబించారు.

ఆయన రచనలు ప్రజలకు సులభంగా అర్థమయ్యే భాషలో ఉండడం వల్ల అవి విస్తృతంగా ప్రాచుర్యం పొందాయి.

భారతీదాసన్ జాతీయవాదం కేవలం రాజకీయ స్వాతంత్ర్యంకే మాత్రమే పరిమితం కాలేదు. ఆయనకు నిజమైన స్వాతంత్ర్యం అంటే సమాజంలో సమానత్వం నెలకొనడం.

- కులవ్యవస్థను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు
- మహిళలకు సమాన హక్కులు ఉండాలని బలంగా నమ్మారు
- అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారు

సమాజంలో అన్యాయాలు తొలగించకుండా దేశం అభివృద్ధి చెందదని ఆయన స్పష్టం చేశారు. ఈ భావాలు ఆయనను ఒక గొప్ప సమాజ సంస్కర్తగా నిలబెట్టాయి.

భారతీదాసన్ రచనల్లో మహిళా విముక్తి ఒక ముఖ్య అంశం. మహిళలు విద్యావంతులు కావాలి, స్వతంత్రంగా ఆలోచించాలి, సమాజంలో సమాన స్థానం పొందాలి అని ఆయన నమ్మారు. ఆయన కవితలు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి.

తమిళ భాషపై భారతీదాసన్‌కు అపారమైన ప్రేమ ఉంది. భాష ఒక జాతి ఆత్మ అని ఆయన విశ్వసించారు. తమిళ భాషను అభివృద్ధి చేయడం ద్వారా భారతీయ సంస్కృతిని కాపాడవచ్చని ఆయన భావించారు.

ఆయన రచనలు తమిళ సాహిత్యాన్ని ప్రజలకు దగ్గర చేశాయి. సాంప్రదాయాన్ని కాపాడుతూ ఆధునిక భావాలను పరిచయం చేశారు.

భారతీదాసన్ రచనల్లో ప్రధానంగా కనిపించే లక్షణాలు:

- దేశభక్తి
- సామాజిక న్యాయం
- సమానత్వం
- సులభమైన భాష
- ప్రజల జీవితానికి దగ్గరగా ఉండే భావాలు

ఈ లక్షణాల వల్లే ఆయన రచనలు కాలాతీతంగా నిలిచాయి.
భారతీదాసన్ మరణించిన తరువాత కూడా ఆయన ఆలోచనలు సమాజాన్ని ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. ఆయన కవితలు ఇప్పటికీ పాఠ్యాంశాలలో చోటు దక్కించుకుని, యువతలో జాతీయ చైతన్యాన్ని పెంపొందిస్తున్నాయి.

ఆయనను "ప్రజాకవి"గా గౌరవించడం యాదృచ్ఛికం కాదు; ప్రజల మనసుల్లో స్థానం సంపాదించిన కవి ఆయన.

సారాంశంగా చెప్పాలంటే, భారతీదాసన్ ఒక గొప్ప జాతీయవాది మాత్రమే కాదు, ఒక సమాజ సంస్కర్త, భాషా ప్రేమికుడు, ప్రజల కవి. ఆయన జీవితం దేశభక్తికి ప్రతీకగా నిలిచింది. ఆయన రచనలు సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం వంటి విలువలను సమాజంలో స్థిరపరిచాయి.

భారతీదాసన్ వంటి మహానుభావుల వల్లే భారతదేశం కేవలం రాజకీయంగా మాత్రమే కాకుండా సాంస్కృతికంగా, సామాజికంగా కూడా బలపడింది. ఆయన పేరు భారతీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి, తరతరాలకు స్ఫూర్తినిచ్చే దీపస్తంభంలా నిలుస్తుంది.

బెజ్జంకి లక్ష్మీ నరసింహస్వామి జాతర

బెజ్జంకి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం తెలంగాణలో అత్యంత విశ్వాసపూర్వకంగా పూజించబడే నరసింహ క్షేత్రాలలో ఒకటి. విష్ణువు యొక్క ఉగ్రరూపమైన నరసింహ అవతారం భక్తులను రక్షించేవాడిగా భావిస్తారు. ఈ దేవాలయం చుట్టూ ఏర్పడిన జాతర శతాబ్దాల చరిత్ర కలిగి, గ్రామీణ సంప్రదాయాలను సజీవంగా ఉంచుతోంది.

ఫాల్గుణ మాసంలో జరిగే ఈ జాతరలో భక్తుల సందడి, పూజలు, ఉత్సవాలు, బజార్లు -- అన్నీ కలిసి ఒక గొప్ప ఉత్సవ వాతావరణాన్ని సృష్టిస్తాయి. కానీ ఈ జాతరను ఇతర జాతరలతో పోలిస్తే ప్రత్యేకంగా నిలబెట్టేది ఒక ప్రత్యేక ఆచారం. అవే "మేకల బండ్లు".

"మేకల బండ్లు" అనేది భక్తులు తమ మొక్కులు తీర్చుకున్న తరువాత, మేకలను ప్రత్యేకంగా అలంకరించి, బండ్లపై తీసుకువచ్చి స్వామివారికి సమర్పించే సంప్రదాయం.

ఇది సాధారణంగా ఇలా జరుగుతుంది. భక్తుడు ఒక కోరిక కోరుకుంటాడు (ఆరోగ్యం, సంపద, కుటుంబ శ్రేయస్సు మొదలైనవి). కోరిక నెరవేరితే, "మొక్కు"గా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ మేకలను సమర్పిస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. జాతర సమయంలో ఆ మేకలను అలంకరించి, ఊరేగింపుగా తీసుకువస్తాడు. ఈ మేకలను ఎంతో శ్రద్ధగా అలంకరిస్తారు. వీటికి రంగురంగుల కుంకుమ, గంధం రాస్తారు, పూలమాలలు వేస్తారు, కొన్నిసార్లు గంటలు, చిన్న అలంకార వస్తువులు కడతారు. మేకల బండ్లను కూడా రంగురంగుల పూలతో, కాగితాలతో అలంకరిస్తారు. ఈ దృశ్యం జాతరలో అత్యంత ఆకర్షణీయంగా ఉంటుంది.

మేకల బండ్లు గ్రామాల నుంచి గుంపులుగా బయలుదేరి, పాటలు, డప్పులు, కోలాటాలతో జాతర స్థలానికి చేరుకుంటాయి. ఈ సందర్భంలో చేసే డప్పుల శబ్దం, జానపద గేయాలు, భక్తుల నృత్యాలు, ఊరేగింపులు జాతరలో ఒక ప్రత్యేక ఉత్సాహాన్ని నింపుతాయి.

ఆలయానికి చేరుకున్న తర్వాత, మేకలను స్వామివారికి అంకితం చేస్తారు. కొందరు మేకలను దేవాలయానికి దానం చేస్తారు. ఇది భక్తి, కృతజ్ఞత, నమ్మకానికి ప్రతీకగా భావించబడుతుంది.

మేకల బండ్లు గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబిస్తాయి. గ్రామాలలో వ్యవసాయం, పశుపోషణ ప్రధానమైన జీవితం. ఈ వేడుక జంతువులతో మనిషికి గల అనుబంధం వ్యక్తపరుస్తుంది. ఈ విధంగా సంప్రదాయాలను తరతరాలుగా కొనసాగించడం గ్రామీణ సంస్కృతిని బలపరుస్తుంది.

భారతదేశంలోని అనేక జాతరల్లో మొక్కులు చెల్లించే సంప్రదాయాలు ఉన్నాయి. కానీ మేకల బండ్లు వంటి పెద్ద స్థాయిలో, సామూహికంగా జరిగే ఆచారం చాలా అరుదు. అందుకే బెజ్జంకి జాతర ప్రత్యేకంగా నిలుస్తుంది.

జాతర సమయంలో తాత్కాలిక దుకాణాలు, జానపద కళలు, ఆటవిడుపు కార్యక్రమాలు జరిగి, ఇది ఒక పెద్ద సామాజిక ఉత్సవంగా మారుతుంది.

ఇటీవల కాలంలో జంతు సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు కూడా చర్చకు వస్తున్నాయి. అందువల్ల కొన్ని ప్రాంతాల్లో బలి స్థానంలో ప్రతీకాత్మక సమర్పణ, జంతు సంరక్షణపై అవగాహన పెరుగుతోంది. తదనుగుణంగా సంప్రదాయాన్ని గౌరవిస్తూ మార్పులు వస్తున్నాయి.

భారతీయ సనాతన ధర్మంలో మహిళా ఔన్నత్యం

హైందవ సంస్కృతి అనేది సృష్టి, స్థితి, లయలతో నిండిన ఒక మహత్తర జీవన తత్వం. ఈ తత్వంలో మహిళకు ఇచ్చిన స్థానం, గౌరవం, మరియు ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ప్రపంచంలోని ఇతర నాగరికతలతో పోల్చితే హైందవ సమాజంలోనే అత్యున్నతంగా నిలుస్తుంది. మహిళను కేవలం కుటుంబ వ్యవస్థలో ఒక భాగంగా కాకుండా, సృష్టికి మూలంగా, శక్తి స్వరూపిణిగా, ధర్మ పరిరక్షకురాలిగా భావించడం హైందవ సమాజం యొక్క అసలైన ప్రత్యేకత.

హైందవ ఆలోచనా విధానంలో మహిళ అనేది బలహీనతకు ప్రతీక కాదు; అది శక్తి, జ్ఞానం, కరుణ, ధైర్యం, మరియు సృజనాత్మకత యొక్క సమగ్ర రూపం. "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః" అనే సూత్రం కేవలం ఒక శ్లోకం కాదు; అది హైందవ సమాజం యొక్క మూల ధర్మాన్ని ప్రతిబింబించే శాశ్వత సత్యం. మహిళను పూజించే చోటే దైవత్వం నివసిస్తుందని చెప్పడం ద్వారా, సమాజ నిర్మాణంలో ఆమె పాత్రను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లింది.

వేద కాలాన్ని పరిశీలిస్తే, మహిళా ఒన్నత్యం కేవలం సిద్ధాంతంలో మాత్రమే కాకుండా ఆచరణలో కూడా ప్రతిఫలించిందని స్పష్టంగా తెలుస్తుంది. ఆ కాలంలో మహిళలు వేదాలను అధ్యయనం చేయడం, తత్వశాస్త్ర చర్చల్లో పాల్గొనడం, యజ్ఞాలలో భాగస్వామ్యం కావడం వంటి హక్కులను సంపూర్ణంగా అనుభవించారు. గార్గి, మైత్రేయి వంటి ఋషికలు కేవలం జ్ఞాన సంపత్తి కలిగినవారే కాదు; వారు సమాజానికి దిశానిర్దేశం చేసిన ఘనులు. ఈ దృశ్యం ఒక విషయం స్పష్టం చేస్తుంది – హైందవ సమాజంలో మహిళను ఎప్పుడూ పరిమితుల్లో బంధించలేదు; ఆమెను ఆలోచనలో, ఆధ్యాత్మికతలో, జ్ఞానంలో సమానంగా ఎదగనిచ్చింది.

హైందవ తత్వంలో మహిళా ఒన్నత్యానికి అత్యంత గంభీరమైన ప్రతీక "శక్తి సిద్ధాంతం". ఈ సిద్ధాంతం ప్రకారం, విశ్వంలోని ప్రతి చలనం, ప్రతి సృష్టి, ప్రతి రూపాంతరం శక్తి ఆధారంగా జరుగుతుంది, ఆ శక్తి స్త్రీ స్వరూపంగా దర్శించబడుతుంది. శివుడు శక్తి లేకుండా అసంపూర్ణుడని భావించడం, మహిళను సృష్టి యొక్క అంతర్భాగంగా మాత్రమే కాకుండా, సృష్టికి మూల కారణంగా గుర్తించడం. ఇది కేవలం ఆధ్యాత్మిక ప్రతీక కాదు; ఇది సమాజానికి మన జాతి ఇచ్చిన ఒక గొప్ప సందేశం – మహిళ లేకుండా సమాజం అసంపూర్ణం.

ఇతిహాసాల్లో కూడా మహిళా ఒన్నత్యం అద్భుతంగా ప్రతిబింబించబడింది. సీతాదేవి పాత్రలో కనిపించే సహనం, ధర్మనిష్ఠ, మరియు ఆత్మగౌరవం ఆమెను కేవలం ఒక పాత్రగా కాకుండా, ఒక విలువగా నిలబెడతాయి. ఆమె జీవితం త్యాగానికి మాత్రమే కాకుండా, స్వీయ గౌరవాన్ని కాపాడుకునే ధైర్యానికి కూడా ప్రతీక. అదే విధంగా ద్రౌపది పాత్రలో కనిపించే ఆత్మగౌరవం, అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడే ధైర్యం, సమాజాన్ని

కుదిపేసే శక్తి – ఇవన్నీ మహిళా ఒన్నత్యానికి శాశ్వత చిహ్నాలు. ఆమె అవమానం ఒక వ్యక్తిగత ఘటనగా కాకుండా, ధర్మాన్ని తిరిగి స్థాపించాల్సిన అవసరాన్ని గుర్తుచేసిన ఘట్టంగా నిలిచింది.

మధ్యయుగ కాలంలో కొన్ని ప్రతికూల పరిస్థితులు వచ్చినప్పటికీ, హైందవ సమాజంలో మహిళా శక్తి పూర్తిగా తగ్గిపోలేదు. ఆ కాలంలో మీరాబాయి వంటి భక్తులు తమ ఆధ్యాత్మిక శక్తితో సమాజాన్ని ప్రభావితం చేశారు. అక్కమహాదేవి తన ఆత్మస్వేచ్ఛతో ఒక విప్లవాత్మక దృష్టిని చూపించారు. రాణి రుద్రమదేవి పరిపాలనలో తన ప్రతిభను నిరూపించి, మహిళలు నాయకత్వంలో కూడా అగ్రస్థానంలో నిలబడగలరని చాటిచెప్పారు. ఈ ఉదాహరణలు ఒక సత్యాన్ని తెలియజేస్తాయి – పరిస్థితులు మారినా, మహిళా శక్తి ఎప్పటికీ నశించదు.

ఆధునిక కాలంలో మహిళా సాధికారతకు వచ్చిన ప్రాధాన్యతను చూస్తే, అది పూర్తిగా కొత్తగా వచ్చిన భావన కాదు; అది హైందవ సంస్కృతిలో ఉన్న మూల విలువల పునరుజ్జీవనం. మహిళలు విద్యలో, ఉద్యోగాలలో, రాజకీయాల్లో ముందుకు రావడం అనేది ఒక ఆధునిక అభివృద్ధి మాత్రమే కాదు; అది ఒక చారిత్రక న్యాయం. హైందవ సంస్కృతి మహిళకు ఇచ్చిన గౌరవం తిరిగి ఆచరణలోకి వస్తున్న దశగా దీనిని చూడవచ్చు.

హైందవ సమాజంలో మహిళా ఒన్నత్యాన్ని అర్థం చేసుకోవాలంటే, ఒక ముఖ్యమైన అంశాన్ని గుర్తించాలి – మహిళను కేవలం ఒక వ్యక్తిగా కాకుండా, ఒక శక్తిగా, ఒక విలువగా, ఒక వ్యవస్థగా చూడడం. ఆమె తల్లి, గురువు, నాయకురాలు, సృష్టికర్త, ధర్మరక్షకురాలు – ఇన్ని విభిన్న పాత్రలు ఆమె ఒన్నత్యాన్ని మరింత మహోన్నతంగా నిలబెడతాయి.

నేటి సమాజంలో మహిళా సాధికారత గురించి మాట్లాడేటప్పుడు, హైందవ సంస్కృతి మనకు ఇచ్చిన ఈ గొప్ప దృక్పథాన్ని మళ్లీ గుర్తు చేసుకోవాలి. మహిళకు గౌరవం ఇవ్వడం అనేది కేవలం ఒక నైతిక బాధ్యత కాదు; అది సమాజ పురోగతికి అవసరమైన మూల సూత్రం. మహిళ శక్తివంతంగా ఉన్నప్పుడు మాత్రమే కుటుంబం బలపడుతుంది, సమాజం అభివృద్ధి చెందుతుంది, దేశం ముందుకు సాగుతుంది.

హైందవ సమాజంలో మహిళా ఒన్నత్యం అనేది ఒక భావన మాత్రమే కాదు; అది ఒక జీవన సత్యం. ఆమె శక్తి, ఆమె జ్ఞానం, ఆమె కరుణ, ఆమె ధైర్యం – ఇవన్నీ కలిసే సమాజాన్ని నిర్మిస్తాయి. ఈ సత్యాన్ని గుర్తించి, ఆచరిస్తేనే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుంది. హైందవ సంస్కృతి మనకు నేర్పిన ఈ విలువలు శాశ్వతమైనవి, సమకాలీనమైనవి, మరియు భవిష్యత్తుకు మార్గదర్శకాలు.

ఈ నెలలో ముఖ్యమైన రోజులు:

శ్రీ హనుమత్ విజయోత్సవం – ఏప్రిల్ 02
ప్రపంచ ఆరోగ్య దినోత్సవం – ఏప్రిల్ 07
శ్రీ రమణ మహర్షి జన్మతిథి – ఏప్రిల్ 14
బసవేశ్వర జయంతి – ఏప్రిల్ 20
అక్షయ తృతీయ – ఏప్రిల్ 20
జగద్గురు శంకరాచార్యులు, శ్రీ రామానుజుల జయంతి – ఏప్రిల్ 22

ఈ పత్రిక లో దక్షిణాపథ యొక్క ఆర్థిక సామాజిక సాంస్కృతిక రాజకీయ చరిత్ర పై మీ వ్యాసాలు ప్రచురించాలంటే సంప్రదించండి
research@csisindia.com

For publishing your articles on Socio Cultural political and Economic history of Dakshinapatha please contact
research@csisindia.com
Contact : +917075881925